సాక్షి
ములుగు
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె - IIలో▸

మేడారం జాతరకు ముందు అద్దె బస్సు డ్రైవర్లు ఆర్టీసీకి ఝలక్ ఇచ్చారు. జీతాలు పెంచకపోవడంతో మెరుపుసమ్మెకు దిగారు.



'వల్లంపట్ల' రచనలతో చైతన్యం

రచయిత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు తన సమగ్ర సాహిత్యం, కళారూపాల ద్వారా సామాజిక చైతన్యం కలిగించారని డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
31.3⁰/19.1⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది. రాత్రివేల చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కన్నాయిగూడెం: ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పి.శ్రీజ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు రికార్డులను తనిఖీ చేశారు. మందులు భద్రపరిచే గదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలోని ఇన్‌పేషెంట్ల గురించి ఆరా తీశారు. రోజు ఎంత మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారో స్థానిక వైద్యాధికారి అభినవ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగ నిర్ధారణశాలను పరిశీలించడంతో పాటు రక్తకణాల మిషన్ పనితీరు గురించి ల్యాబ్ టెక్నీషియను అడిగి తెలుసుకున్నారు. రక్తకణాలు, మలేరియా, టైఫాయిడ్ వంటి పరీక్షలు నిరంతరం నాణ్యతతో నిర్వహించాలన్నారు. అనంతరం బుట్టాయిగూడెంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం బుట్టాయిగూడెం కేజీబీవీ పాఠశాల నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయని ఈ సంవత్సరం కూడా ఉత్తీర్ణత శాతం పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

13 టేకు దుంగలు.. రెండు బైక్‌లు స్వాధీనం




వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర ఇసుక క్వారీ సమీపంలో 13 టేకు దుంగలను, రెండు ద్విచక్ర వాహనాలను అటవీ శాఖ అధికారులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎదిర ఇసుక క్వారీ సమీపంలో టేకు దుంగలు దాచి ఉంచారనే సమాచారం మేరకు రేంజర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది గాలించారు. ఇసుక క్వారీ సమీపంలో 13 టేకు దుంగలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారుగా రూ.1.60 లక్షలు ఉంటుందని అటవీ శాఖాధికారులు తెలిపారు. వీటితో పాటు రెండు ద్విచక్రవాహనాలను జప్తు చేశారు. అటవీ శాఖాధికారులు అక్కడికి వచ్చిన విషయం తెలుసుకున్న సదరు వ్యక్తులు అక్కడి నుంచి పరారైనట్లు రేంజర్ తెలిపారు. కాగా టేకు దుంగలను గోదావరి దాటించి అంతర్ రాష్ట్ర స్మగ్లింగ్ చేస్తున్నట్లుగా గుర్తించారు. ఈ దుంగలను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అటవీ ప్రాంతం నుంచి తెచ్చినట్లు రేంజర్ వివరించారు.

ఓరుగల్లుకు అంతంతే..

సంతోషమివ్వని కేంద్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

- మేడారం జాతరకు జాతీయ హోదాపై లేని మాట
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు మిత్ర లేదు
- మామునూరు ఎయిర్‌పోర్టుపై స్పష్టత కరువు
- నానో డీఏపీతో రైతులకు మేలు
- ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి ఆశాలు, అంగన్ వాడీ వర్కర్లు



సాక్షి, వరంగల్:

పార్లమెంట్ ఎన్నికల వేళ కేంద్రం గురువారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఓరుగల్లు కీలక అభివృద్ధి పనులకు మొండిచెయ్యే కనిపించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది ఇప్పటికే గతేడాది రూ.140 కోట్లతో ప్రధాని మోదీ ప్రారంభించిన కాజీపేట వ్యాగన్ షెడ్ పనులు మరింత వేగవంతం అయ్యేందుకు ఈ బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించడం కాస్త సంతోషాన్ని కలిగిస్తోంది. ఇతర రైల్వే పనుల మాట వినిపించలేదు. ఇక ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్‌లో ఉన్న సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతీయ హోదాపై ఎటువంటి ప్రకటన రాకపోవడం నిట్టూర్పును మిగిల్చింది. ఇప్పటికే పీఎం మిత్ర కింద ఎంపికైన గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధుల కేటాయింపు ఊసే వినిపించలేదు. అలాగే ఉడాన్ పథకం కింద ఎంపికైన మామూనూరు విమానాశ్రయ నిర్మాణానికి నిధుల కేటాయింపుపై స్పష్టత లేకపోవడం నిరాశ మిగిల్చింది. అదే సమయంలో వ్యవసాయ సాగుకు సహకారం, పాల ఉత్పత్తి పెంచేలా చర్యలు, ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, రూఫ్‌టాప్ సోలార్‌కు ప్రోత్సాహం, యువతకు వడ్డీలేని దీర్ఘకాలిక రుణాలు ఊరటనిచ్చే అంశాలుగా చెప్పొచ్చు. పర్యాటకానికి ప్రోత్సహిస్తూ కేంద్రం తెచ్చిన బడ్జెట్ ఓరుగల్లు పర్యాటకం అభివృద్ధికి ఆసరా కానుంది. ములుగులోని గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ముందుకెళుతుందని నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

బాలికలకు మేలు

సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణలో భాగంగా 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు బాలికలకు వ్యాక్సినేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

జిల్లాల వారీగా బాలికలు	
వరంగల్	64,088
జనగామ	20,636
మహబూబాబాద్	15,696
భూపాలపల్లి	14,300
హనుమకొండ	25,356
ములుగు	7,040

వీటితో ప్రయోజనమే...

- సౌరశక్తి ఉత్పత్తి కోసం నిధుల్ని దండిగా కేటాయించడం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌లు పెరిగే అవకాశముంది. పర్యాటక ప్రాంతాల్లోనూ పీపీపీ పద్ధతిలో అభివృద్ధి పనులు చేయాలనే నిర్ణయంతో ఇక్కడ ప్రగతికి ఊతమందనుంది.
- మధ్యతరగతి ప్రజలు ఇళ్లు కొనుగోలు చేయడం, కట్టుకోవడం కోసం సాయం చేస్తామన్న ప్రకటనపై ఆనందంతో ఉన్నారు.
- పాల దిగుబడిని కేంద్రం ప్రోత్సహిస్తుందని చెప్పడంతో ఉమ్మడి వరంగల్‌లో సుమారు ఏడు లక్షలకుపైగా పశువులు ఉండగా, 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అవుతుంది. ఈ పరిశ్రమపై ఆధారపడిన పాడి రైతులకు లబ్ధి కలగనుంది. కేంద్రం తీసుకురానున్న ప్రత్యేక కార్యాచరణతో పాల దిగుబడి పెరిగే అవకాశముంది.
- ఉమ్మడి జిల్లాలో సుమారు .7,54,320 మంది రైతులు ఉండగా 15లక్షల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం ఉంది. నానో డీఏపీతో నేల కాలుష్యం కాకుండా ఉంటుంది. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానం విస్తరించి ప్రతిరైతు డ్రోన్ సహాయంతో పిచికారి చేసుకునే అవకాశం ఉంటుంది.

ఆశ, అంగన్‌వాడీలకు 'ఆయుష్మాన్ భవ'



ప్రజల ఆరోగ్యం గురించి అహర్నిశలు పనిచేస్తున్న ఆశా కార్యకర్తల కుటుంబాలకు శుభవార్త అందింది. వారి ఆరోగ్య బీమాగా ఉండేందుకు ఆయుష్మాన్ భారత్ పథకం వర్తింపజేశారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 3,626మంది ఆశావర్కర్లు, 4,669మంది అంగన్‌వాడీ వర్కర్లు లబ్ధి పొందనున్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకం కింద లబ్ధి పొందేవారు..

జిల్లా	ఆశ వర్కర్లు	అంగన్‌వాడీ వర్కర్లు
వరంగల్	672	747
హనుమకొండ	630	650
మహబూబాబాద్	886	1437
జనగామ	520	628
భూపాలపల్లి	420	567
ములుగు	498	640

విద్యా, వైద్య రంగాల్లో నిర్లక్ష్యం..



కేంద్ర బడ్జెట్ విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేసినట్లుగా ఉంది. గతేడాది మొత్తం బడ్జెట్ 2.51 శాతం కేటాయించి ఈసారి 2.61 శాతం బడ్జెట్‌లో కేటాయించడం అంటే ఒక్క శాతం మాత్రమే పెంచడం.. ఇది విద్యాభివృద్ధికి దోహదం చేయదు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం కేటాయించాలని జీడీపీలో 6 శాతం కేటాయించాల్సి ఉండేది. వైద్యానికి గతంలో 2.20 శాతం ఉండగా ఇప్పుడు రూ 90వేల కోట్లకే పరిమితం చేయడంతో ఉచిత వైద్య ఎలా అందుతుంది?

- కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

నానో డీఏపీతో రైతులకు వ్యయం, శ్రమ తగ్గుతుంది...



నానో డీఏపీపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇంకా టెస్టింగ్ దశలో ఉంది. నానో డీఏపీ అందుబాటులోకి వస్తే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది. నేలలో భారీగా ఎరువులు వేసే వ్యయం ,శ్రమ తగ్గుతుంది. గుళికలు ఉన్న బస్తా డీఏపీ రూ.1350 అయితే ద్రవరూపంలో ఉన్న డీఏపీ అందులో సగం ధరకే అందుబాటులోకి రానుండడం రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే నానో యూరియా వాడకంపై రైతుల్లో చైతన్యం వచ్చి వాడుతున్నారు.

- రావుల ఉమారెడ్డి, ఏడీఆర్, వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం

హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ ఎత్తివేస్తే బాగుండేది...



గత ఏడాది ప్రతిపాదించిన కొత్త పన్ను విధానమే ఈసారి కూడా కొనసాగుతుందని ప్రకటించడంతో వ్యక్తిగత ఆదాయపు పన్ను విషయంలో పెద్దగా మార్పులేదు. కరోనా మహమ్మారి వచ్చాక హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించి ఈ ఆరోగ్య పాలసీ విషయంలో కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయం. హెల్త్ ఇన్సూరెన్స్ పై జీఎస్టీ ఎత్తివేస్తే బాగుండేది. ఆదాయపు పన్ను 80సీ సెక్షన్ కింద రూ.1,50,000లు లిమిట్‌ను రెండింతలు చేస్తే బాగుండేది. పిల్లల స్కూల్ ఫీజులు, ఇన్సూరెన్స్‌లు రూ.లక్షల్లో కట్టాల్సిన పరిస్థితి ఉంది.

- టి.శ్రీకాంత్, చార్టెడ్ అకౌంటెంట్, వరంగల్

ఆరోగ్యం, విద్య మీద 10 శాతం జీడీపీ కేటాయిస్తే బాగుండేది..



ఆరోగ్యం, విద్య మీద కనీసం 10 శాతం జీడీపీ కేటాయిస్తే బాగుండేది. అందరూ బాగా చదువుకొని, ఆరోగ్యంగా ఉంటే ఆర్థిక వనరులు వస్తాయి. కేంద్రం ఈ దిశగా ఆలోచన చేసి అమలు చేస్తే ఎంతో మంచిది. ఈ రంగాలకు కొంత కేటాయింపులు జరిగినా భారీగా నిధులు కేటాయిస్తే దేశం అభివృద్ధి దిశలో మరింత వేగంతో దూసుకెళ్లే అవకాశముంది.

- సురేశ్‌లాల్, ప్రొఫెసర్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం

ఆయుష్మాన్ భారత్ వర్తింపు ఆనందంగా ఉంది..



ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అంగన్ వాడీ సిబ్బందితోపాటు ఆశా వర్కర్లకు వర్తింపజేయడం చాలా సంతోషంగా ఉంది. రూ.ఐదు లక్షలతో కూడిన ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. మమ్మల్ని ఇందులో చేర్చినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు.

- చిరుతం మాధవి, చెన్నారావుపేట ఆశ వర్కర్

కాజీపేట సబ్‌డివిజన్ రైల్వేకు ఊరట

- కాజీపేట వ్యాగన్ పీఓహెచ్ రూ.150 కోట్లు
- కాజీపేట–విజయవాడ థర్డ్‌లైన్‌కు రూ.256 కోట్ల నిధులు
- వరంగల్–హసన్‌పర్తి బైపాస్‌లైన్‌కు రూ.126.50 కోట్లు
- కాజీపేట డీజిల్, ఎలక్ట్రిక్ షెడ్ల అభివృద్ధికి నిధులు రూ.14 కోట్లు
- కాజీపేట పిట్‌లైన్‌కు రూ.కోటి




కాజీపేట రూరల్: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సంబంధించిన పింక్‌బుక్‌ను రైల్వే బోర్డు విడుదల చేసింది. రైల్వే పరంగా కాజీపేట సబ్ డివిజన్‌లో పలు ప్రాజెక్టులు, కొత్త రైల్వే లైన్లు, కాజీపేట రైల్వే వ్యాగన్ షెడ్, కాజీపేట పిట్‌లైన్, కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించారు. కాజీపేట అయోధ్యపురంలో నిర్మాణమవుతున్న రైల్వే పీఓహెచ్ షెడ్‌కు ఈ ఏడాది రూ.150 కోట్లు, కాజీపేట–విజయవాడ మూడో రైల్వేలైన్‌కు రూ.256కోట్లు, కాజీపేజీ 24 కోచ్‌ల పిట్‌లైన్ అభివృద్ధికి రూ.కోటి కేటాయింపులు చేశారు. అదేవిధంగా హసన్‌పర్తి–వరంగల్ బైపాస్ లైన్‌కు రూ.126.50 కోట్లు, కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ అభివృద్ధికి రూ.కోటి, డిజిల్ లోకోషెడ్ ట్రాక్షన్ సిస్టం అభివృద్ధికి రూ.13 కోట్లు, భద్రాచలం–కొవ్వూరు 41.55 కి.మీ రైల్వేలైన్‌కు రూ.10 కోట్లు, భద్రాచలం రోడ్–డోర్నకల్ 54.65 కి.మీ రైల్వే లైన్‌కు రూ.100 కోట్లు, కొండపల్లి–కొత్తగూడెం 125 కి.మీ. రైల్వేలైన్‌కు రూ.10 కోట్లు, మణుగూర్–రామగుండం 200 కి.మీ రైల్వే లైన్‌కు రూ.5 కోట్లు, సికింద్రాబాద్–కాజీపేట మధ్య ఆర్వోబీలకు రూ.20 కోట్లు, బల్లార్షా–కాజీపేట మధ్య రైల్వే స్టేషన్‌ల అభివృద్ధికి, కాజీపేట–విజయవాడ మధ్య గల పలు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు కేటాయించారు.

క్యూరింగ్ చేయని కిచెన్ షెడ్ పిలర్లు



నిర్మాణాలు సరే.. క్యూరింగేది?

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతర సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శాశ్వత నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఎండోమెంట్ ఆవరణలో కిచెన్ షెడ్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. బేస్‌మెంట్ పిల్లర్ల స్థాయిలో పనులు జరుగుతున్నాయి. సీసీ పనులకు కనీసం రోజుకు మూడు సార్లైనా వాటర్ క్యూరింగ్ చేయాల్సి ఉండగా అవేమి చేయకుండానే టకటక పనులు కానిస్తున్నారు. అంతేకాకుండా పూజా మందిరంపై గోపురాలు నిర్మిస్తున్నారు. దీనికి కూడా క్యూరింగ్ చేయకుండానే పనులు చేస్తున్నారు. నిత్యం సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నా క్యూరింగ్ పై దృష్టి సారించడం లేదు. పనులు నాణ్యతగా ఉండాలని పదేపదే మంత్రులు, కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశిస్తున్నా వేగంగా పనులు చేయాలనే తొందరలో కనీస ప్రమాణాలు పాటించడం లేదని భక్తుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.



క్యూరింగ్ చేయని పూజా మందిర గోపురం

వనదేవతలకు భక్తుల మొక్కులు



గద్దెల ప్రాంగణంలో భక్తుల సందడి



యాంకర్‌ను చూస్తున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గురువారం సమ్మక్క రోజు కావడంతో ఉదయం నుంచే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. జంపన్నవాగులో షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద నిలువెత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, చీర, సారె, ఒడిబియ్యం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. భక్తుల రద్దీతో తల్లుల గద్దెల ప్రాంగణం జనసందడిగా మారింది. గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్న భక్తులను ఎప్పటికప్పుడు బయటకి పంపించేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం చుట్టుపక్కల అటవీ ప్రాంతంలోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు ఆరగించారు. కాగా గద్దెల ప్రాంగణంలో ఓ ప్రైవేట్ ఆల్బమ్ పాట చిత్రీకరణకు వచ్చిన యాంకర్లను భక్తులు ఆసక్తి తిలకించారు.



వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య



వైద్య శిబిరంలో రోగితో మాట్లాడుతున్న అప్పయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరలో ఏర్పాటు చేసిన వైద్య సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. జాతర సమయంలో నాలుగు రోజుల పాటు టీటీడీ కల్యాణ మండపంలో ఆస్పత్రి ఏర్పాటు చేయనున్న సందర్భంగా భవన మరమ్మతు పనులను పరిశీలించి తాపీ మేస్త్రీలకు పలు సూచనలు చేశారు. జంపన్నవాగు దగ్గర ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. భక్తులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి మల్లికార్జున్, శ్రీలతలను అడిగి తెలుసుకున్నారు. మేడారంలోని కోర్ ఏరియాలో ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాల స్థలాల వద్ద పాతిన బోర్డులను పరిశీలించారు. చిలకమ్మగుట్ట, హరిత హోటల్ క్యూలైన్ గ్రామపంచాయతీ దగ్గర స్థలాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు లేదా భూమి సంబంధిత యజమానులు తొలగించగా వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్, వైద్యాధికారులు రంజిత్, వేణు, హెచ్ఈ ఖలీల్, హెల్త్ అసిస్టెంట్లు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహాజాతర పనుల్లో వేగం పెంచాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- అధికారులతో టెలికాన్ఫరెన్స్



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: మేడారం మహాజాతర పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో పీఓ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్యతో వైద్య శాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలు, ప్రస్తుతం మేడారం వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు ఐటీడీఏ క్యాంప్ ఆఫీస్, టీటీడీ కల్యాణ మండపం, జంపన్నవాగు, రెడ్డిగూడెం స్కూల్, నార్లాపూర్ సబ్ సెంటర్, మేడారం బస్టాండ్ వద్ద ఉండాలన్నారు. మెడికల్ క్యాంపుల్లో కావాల్సిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా మత్స్యశాఖ అధికారులతో మాట్లాడుతూ జంపన్నవాగు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న 200 మంది గజ ఈతగాళ్లు, తదితర వివరాలపై ఆరా తీశారు. జంపన్న వాగు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మత్స్యశాఖ తరఫున అప్రమత్తంగా ఉంటూ లైఫ్ జాకెట్లు, థర్మకోల్ షీట్లు, లైట్ వెయిట్ ట్యూబ్స్ వంటివి సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అడవిలో నిప్పు రవ్వలు పడి దగ్ధమయ్యే ప్రమాదం ఉందని అందుకు సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 200మంది సిబ్బంది 11వెహికల్స్‌తో 14 మిస్ట్ బ్లోయర్స్‌తో మహాజాతర ఏర్పాట్లలో సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా డీపీఓ వెంకయ్య మాట్లాడుతూ రాజమండ్రి నుంచి పారిశుద్ధ్య కార్మికులను తీసుకొచ్చినట్లు వివరించారు.

విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తం

మహాజాతర పనుల్లో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలు జరగకుండా, విద్యుత్ కోతలు లేకుండా చూడాలని పీఓ అన్నారు. దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడుతూ అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లు ముఖ్యంగా లైటింగ్, పెయింటింగ్‌తో పాటు ఆ ప్రాంగణంలో తీసుకుంటున్న వివరాలు తెలుసుకొని ముఖ్యంగా పెయింటింగ్, లైటింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని పీఓ వివరించారు. అదేవిధంగా జాతరలో అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేస్తున్న ఆహారానికి సంబంధించిన విషయాలను ఐటీడీఏ డీడీ పోచం అడిగి తెలుసుకున్నారు. పూజారులు, ఆదివాసీ సంఘాలు తెలిపిన సూచనలను ఏపీఓ వసంతరావు పీఓ అంకిత్‌కు వివరించారు.

హెచ్చరిక బోర్డులు, మెడికల్ క్యాంపుల పరిశీలన

మేడారంలోని జంపన్నవాగు వద్ద మత్స్యశాఖ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పీఓ అంకిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి జంపన్నవాగులోకి దిగొద్దని తెలిపారు. మెడికల్, మత్స్యశాఖతో పాటు వివిధ ఏర్పాట్ల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మేడారం ఆర్టీసీ బస్సు స్టాప్‌లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతి కుమార్‌ను పీఓ ఆదేశించారు. అంతే కాకుండా ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మహాజాతరలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

వాజేడు: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏటీడీఓ దేశీరాం నాయక్ అన్నారు. మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించిన ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో పాటు ప్రత్యేక మెనూ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు.

అటవీశాఖ రుసుము మినహాయింపు

అధికారులకు ఆదేశాలు జారీ చేసిన మంత్రి సురేఖ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల వాహదారుల నుంచి అటవీ శాఖ వసూలు చేసే పర్యావరణ రుసుము నుంచి ఈ నెల 29వరకు మినహాయింపు కల్పిస్తున్నట్లు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు తక్షణం అమలులోకి వస్తాయని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జాతరకు వచ్చే వాహనాలు, రద్దీ నియంత్రణ కూడా కొంత మేరకు సులువయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు జిల్లా అటవీ శాఖ అధికారి తక్షణం చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏటూరునాగారం అభయారణ్యం పరిధిలో పస్రా, తాడ్వాయి, ఏటూరునాగారం నుంచి వచ్చే వాహనాల నుంచి నామమాత్రపు పర్యావరణ రుసుమును ఇప్పటి వరకు అటవీ శాఖ వసూలు చేసిందని, ఈ రుసుం ద్వారా వచ్చే ఆదాయంతో అటవీ ప్రాంతాల రక్షణ, ప్లాస్టిక్ తొలగింపు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ వినియోగిస్తోంది. వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు జాతర ముగిసే వరకు ఈ రుసుము వసూలు నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

ఏటీఎం కార్డు మార్చి డబ్బు డ్రా..

- లబోదిమంటూ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని ఏటీఎం వద్ద ఘటన

వరంగల్ క్రైం: హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని ఏటీఎం దగ్గర ఓ గుర్తు తెలియని వ్యక్తి.. మావిళ్ల రామసుబ్బయ్య అనే వృద్ధుడి ఏటీఎం కార్డు తీసుకుని మరో కార్డు ఇచ్చి మోసం చేసినట్లు హనుమకొండ సీఐ కరుణాకర్ తెలిపారు. హనుమకొండ పద్మాక్షి కాలనీకి చెందిన రామసుబ్బయ్య గత నెల 26న ఉదయం 10.30 గంటల సమయంలో డబ్బు డ్రా చేయడానికి ఏటీఎం కేంద్రానికి వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తిని డబ్బు డ్రా చేయమని కోరాడు. అతను డ్రా చేసినట్లు నటించి మిషన్ పనిచేయడం లేదని చెబుతూ రామసుబ్బయ్యకు మరో కార్డు ఇచ్చాడు. అనంతరం అదే ఏటీఎం ద్వారా రూ.40 వేలు, స్వైపింగ్ ద్వారా మరో రూ. 45,270 డ్రా చేసినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వంగపహాడ్‌లో దారి దోపిడీ

హసన్‌పర్తి : వంగపహాడ్‌లో జరిగిన దారి దోపిడీ ఘటనపై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు గొల్ల బుద్దారం నుంచి వంగపహాడ్ వైపునకు బైక్‌పై బయలుదేరారు. ఈక్రమంలో వంగపహాడ్ హైవే సమీపంలో ముగ్గురు వారిని అడ్డుకున్నారు. బీర్ బాటిల్ పగులగొట్టి చంపుతామని బెదిరించి రూ.12వేలు తీసుకుని పారిపోయారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేయిస్తంభాల దేవాలయం సమీపంలో బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో బైక్ అదుపుతప్పి వరంగల్ గిర్మాజీపేటకు చెందిన రామరాజు యాదగిరి (59) దుర్మరణం చెందినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. యాదగిరి ఆర్టీసీ–1 డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని వరంగల్‌లో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ప్రస్తుతం నివాసం ఉంటున్న భవానీనగర్‌కు వస్తున్నాడు. వేయిస్తంభాల దేవాలయం సమీపంలో కుక్క అడ్డువచ్చి బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు రామరాజు అభినవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అద్దెబస్సు డ్రైవర్ల మెరుపు సమ్మె

మేడారం జాతర ముందు ఆర్టీసీకి ఝలక్ | **మూడు డిపోలకు చెందిన 150 బస్సుల నిలిపివేత**

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు
- అద్దె బస్సుల యజమానులు డ్రైవర్లతో చర్చలు
- జీతాలు పెంచేందుకు అంగీకారం.. సమ్మె విరమణ


'కుడా' మైదానంలో నిరసన చేపడుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

హన్మకొండ : మేడారం జాతర ముందు అద్దె బస్సు డ్రైవర్లు ఆర్టీసీకి ఝలక్ ఇచ్చారు. తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించుకునేందుకు అదును చూసి ఆర్టీసీ యామాన్యం, అద్దె బస్సుల యాజమాన్యంపై తీవ్ర ఒత్తిడి పెంచారు. తమకు జీతాలు పెంచాలని నెల రోజుల క్రితం అద్దె బస్సుల యజమానులకు డ్రైవర్లు నోటీసు ఇచ్చారు. అయినా జీతాలు పెంచకుండా కాలయాపన చేస్తుండడంతో గురువారం ఒక్కసారిగా మెరుపు సమ్మెకు దిగారు. ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో 9 డిపోలుండగా జిల్లా కేంద్రం హనుమకొండలో ఉన్న వరంగల్–1, వరంగల్–2, హనుమకొండ డిపోలకు చెందిన డ్రైవర్లు సమ్మెకు దిగారు. ఆర్టీసీ అద్దె బస్సుల యాజమాన్యానికి, ఆర్టీసీ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే బస్సులు నిలిపివేశారు. ఉదయమే హనుమకొండ బాలసముద్రంలోని 'కుడా' మైదానానికి చేరుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమ్మెతో ఈ మూడు డిపోలకు చెందిన 150 అద్దె బస్సులు నిలిచిపోయాయి. దీంతో ఈ బస్సులు తిరిగే రూట్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లోనూ బస్సుల కోసం ప్రయాణికులకు నిరీక్షించారు. ఇదిలా ఉండగా సమ్మక్క, సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యంలో మేడారం వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం, అద్దె బస్సు డ్రైవర్ల యజమానులపై ఒత్తిడి పెంచేలా పక్కా వ్యూహంతో గురువారం సమ్మెకు దిగారు. దీంతో రీజియన్‌లోని ఇతర డిపోల నుంచి బస్సులు తెప్పించుకుని 30 ప్రత్యేక బస్సులు మేడారం నడిపారు. జాతర సమయంలోనైతేనే త్వరగా స్పందిస్తారని అద్దె బస్సు డ్రైవర్లు భావించినట్లుగానే ఆర్టీసీ అధికారులు, అద్దె బస్సుల యజమానులు త్వరగా స్పందించారు. అధికారులు ఒత్తిడి పెంచడంతో అద్దె బస్సు యజమాన్యాలు.. డ్రైవర్లతో చర్చలు జరిపాయి. ఈ చర్చలో జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పల్లె వెలుగు బస్సు డ్రైవర్‌కు ఇప్పటి వరకు రూ.15 వేలు ఉండగా రూ.17,600 జీతం పెరిగింది. ఎక్స్‌ప్రెస్ బస్ డ్రైవర్‌కు రూ.16 వేలు ఉండగా రూ.18,600 పెరిగింది. జీతం పెంపుపై ఇరు వర్గాల మధ్య అంగీకారం కుదరడంతో అద్దె బస్సు డ్రైవర్లు సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. ఈ చర్చల్లో ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్కం ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్, రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి, అద్దె బస్సుల డ్రైవర్ల ప్రతినిధులు హరికృష్ణ, శివకృష్ణ, వీరస్వామి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కుమారస్వామి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.


అద్దె బస్సు డ్రైవర్ల సమ్మెతో నిలిచిన బస్సులు

హక్కుల సాధనకు ఉద్యమించాలి

- సీఐటీయూ జాతీయ కార్యదర్శి సింధు



మాట్లాడుతున్న సింధు

కాజీపేట రూరల్: శ్రామిక మహిళలు తమ హక్కుల సాధనకు ఉద్యమమించాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఎ.ఆర్.సింధు పిలుపునిచ్చారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాసలో గురువారం ఆల్ ఇండియా వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ జాతీయ సమావేశంలో సింధు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రామిక మహిళ హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని మండిపడ్డారు. కనీస వేతనాలు, నిరుద్యోగం, అధిక ధరల వంటి సమస్యలతో దేశంలో శ్రమ దోపిడీకి గురి చేస్తుందని, ఈ వినాశకర విధానాలకు ప్రతిఘటనగా ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేయాలన్నారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పని ప్రదేశాల్లో ఘనంగా జరపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం శ్రామిక మహిళ జీవితాలను ప్రభావితం చేస్తున్న సమస్యలను పక్కదారి పట్టించేందుకు హిందూ మతతత్వవాదం, భావోద్వేగం, వైషమ్యాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. మనువాదంతో మహిళ హక్కులకు భంగం కలిగిస్తోందని, ఈ పరిస్థితుల్లో ఐక్యంగా భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాగా, శుక్రవారం సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలను ప్రారంభించనున్నారు. ఈ సమావేశాలు ఈ నెల 3వ తేదీన ముగుస్తాయి. నర్సికెట్లా అమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత, ప్రధాన కార్యదర్శి కామ తపన్‌సేన్, కోశాధికారి ఎం.సాయిబాబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగుల భాస్కర్, కార్యదర్శులు జె.వెంకటేష్, రాగుల రమేష్, తెలంగాణ రాష్ట్ర శ్రామిక నాయకులు ఎస్.వి.రమ, సి.జయలక్ష్మి, హనుమకొండ సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ టి.ఉప్పలయ్య, గాదె ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

పరకాల: నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన మేకల యుగేందర్‌ను గత నెల 30వ తేదీన గొడ్డలితో దారుణంగా హత్య చేసిన నిందితుడు మేకల సిద్దును పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్.. యుగంధర్ హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూతగదాలే యుగంధర్ హత్యకు దారి తీశాయన్నారు. గత నెల 30వ తేదీన కౌకొండ గ్రామ సెంటర్‌లో చలి మంటకాగుతున్న సమయంలో యుగేంధర్‌ను మేకల సిద్దు గొడ్డలితో దారుణంగా హత్య చేసి బైక్‌పై పారిపోయాడన్నారు. రెండు రోజుల నుంచి నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు. ఈ క్రమంలో పరకాల రూరల్ సీఐ మల్లేషం, దామెర ఎస్సై కొండ అశోక్.. కంఠాత్మకూర్ సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా సిద్దు పట్టుబడినట్లు తెలిపారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని బైక్‌తోపాటు గొడ్డలిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా.. డ్రైవర్ మృతి


బోల్తాపడిన గ్యాస్ ట్యాంకర్

ధర్మసాగర్ : గ్యాస్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం గురువారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తమిళనాడుకు చెందిన ఎ నటరాజన్ (40) గ్యాస్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, గ్యాస్ ట్యాంకర్‌తో హైదరాబాద్‌లోని చర్లపల్లి నుంచి కమలాపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాజీపేట మండలంలోని రాంపూర్ శివారులో జాతీయ రహదారిపై ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నటరాజన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ రావు తెలిపారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు


రాజు(ఫైల్)

వెంకటాపురం(కె): గోదావరి నదిలో స్నానం కోసం వెళ్లి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన గురువారం మండలంలోని సూరవీడు గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పామేడు గ్రామానికి చెందిన వెల్లి పుప్పాల రాజు(40) సూరవీడు గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. స్నానం చేయడానికి బంధువులతో కలిసి గోదావరి నదిలోకి వెళ్లాడు. స్నానం చేస్తూ లోతు అంచనా తెలియకపోవడంతో గల్లంతయ్యాడు. రాజు గల్లంతైన విషయం తెలుసుకున్న గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు.

హెల్మెట్ ధరించి వాహనం నడపాలి

- వరంగల్ ఆర్టీఓ రంగారావు
- వాహనదారులకు రోడ్డుభద్రతపై అవగాహన


'రోడ్డు భద్రత మీచేతులోనే' అనే పేరుతో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంవీఐలు

ఖిలా వరంగల్ : వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని వరంగల్ ఆర్టీఓ రంగారావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం వరంగల్ జిల్లా రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్ రాథోడ్, కోల రవీందర్ ఆధ్వర్యంలో వాహనదారులకు స్పీడ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలు, హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీఓ రంగారావు ముఖ్యఅతిథిగా హాజరై 'రోడ్డు భద్రత మీచేతులోనే' అనే ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడిపి సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపి ప్రమాదాలు తెచ్చుకోవద్దని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. ఓవర్‌లోడ్, ఓవర్‌స్పీడ్, ట్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా బైకులు, ఇతర వాహనాలు నడపడం నేరమన్నారు. వేగం కన్నా గమ్యం ముఖ్యమని, ప్రాణాలు కాపాడుకోవడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని, రహదారి భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యా సంస్థల బస్సు ఓనర్స్ అధ్యక్షుడు గాదె స్వరూప్‌రెడ్డి, ఏఎంవీఐలు శాలిని, స్వర్ణలత, డీటీవీ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మావో'లు జనజీవనంలో కలవాలి

- ములుగు ఎస్పీ శబరీష్
- లొంగిపోయిన సెక్షన్ కమాండర్ నుపబీమా దంపతులు


మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ములుగు: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని, లొంగిపోయిన మావోయిస్టులకు అండగా ఉంటామని ములుగు ఎస్పీ శబరీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మావోయిస్టు (సీపీఐ) పార్టీకి చెందిన సెక్షన్ కమాండర్ నుపబీమ అలియాస్ సంజు, అతడి భార్య ముచ్చకి దుల్గో అలియాస్ సోని గురువారం ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బూర్గుపాడు గ్రామంలో నుపబీమ అలియాస్ సంజు కూలీగా పనిచేసేవాడని, ఈక్రమంలో సోనితో పరిచయం ఏర్పడడంతో ఆమెకు నిషేధిత సీపీఐ మావోయిస్టు విప్లవాత్మక సిద్ధాంతాలు వివరించి పార్టీలో చేరడానికి ప్రేరేపించాడని తెలిపారు. నుపబీమ లక్మ దళంలో చేరి మొదట చర్ల ప్రాంతంలో మిలీషియా సభ్యుడిగా పనిచేశాడన్నారు. అనంతరం మావోయిస్టు పార్టీ సెకండ్ సీఆర్‌సీ కాటారం కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్‌తో పరిచయం ఏర్పడి మూడేళ్లు పనిచేసి అనంతరం నవంబర్ 2022లో చర్ల సెక్షన్ కమాండర్‌గా పదోన్నతి పొందాడని తెలిపారు. అతడి భార్య దుల్గో అలియాస్ సోని కూడా 2018లో అజ్ఞాతంలో వెళ్లిందన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన రమేష్, జంగ్లా మాటల కారణంగా సాగర్ నాయకత్వంలో చేరి డిసెంబర్ 2022లో ఈపీపీసీవాసిఎంగా పదోన్నతి పొందిందన్నారు. ప్రస్తుతం ఆమె సీజీ కమాండర్‌గా పనిచేస్తోందన్నారు. అయితే మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పార్టీలో జరుగుతున్న వివక్ష నచ్చక నుపబీమా, దుల్గో దంపతులు లొంగిపోయారని ఎస్పీ తెలిపారు. ఈ దంపతులు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ములుగు ఓఎస్‌డీ అశోక్‌కుమార్, డీఎస్పీ రవీందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల వేధింపులు..

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- పరిస్థితి విషమం


వీరన్నను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబీకులు

గార్ల: విద్యుత్ విజిలెన్స్ అధికారుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి అధికారుల ముందే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మర్రిగూడెం పంచాయతీ పరిధి సరిహద్దుతండాలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. తండాకు బానోత్ వీరన్న తన ఇంటికి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పెట్టుకుని చౌర్యానికి పాల్పడుతున్నాడని, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వరంగల్ వెళ్లి విద్యుత్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు గురువారం వీరన్న ఇంటికి వచ్చి తనిఖీలు చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డావు.. కేసు పెట్టి జరిమానా విధిస్తామని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన వీరన్న ఇంట్లో నుంచి పురుగుమందు డబ్బా తీసుకొచ్చి విజిలెన్స్ అధికారుల ముందే తాగాడు. అధికారులు వెంటనే ఆ డబ్బాను లాక్కొని పారేశారు. అప్పటికే వీరన్న అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఖమ్మం తరలించారు. ప్రస్తుతం వీరన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యుత్ విజిలెన్స్ అధికారుల వేధింపుల వల్లే పురుగుమందు తాగాడని,, వీరన్నకు ఏమైనా జరిగితే వారే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లోఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విద్యుత్ విజిలెన్స్ ఏడీ నాగరాజును సాక్షి వివరణ కోరగా వీరన్న ఇంట్లో విద్యుత్ చౌర్యంపై తనిఖీలు చేస్తుండగా పురుగు మందు డబ్బా తీసుకొచ్చి తాగుతుండగా తామే డబ్బాను లాక్కొని పారేశామన్నారు. వీరన్నను ఎలాంటి ఇబ్బంది పెట్టలేదని పేర్కొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


శ్రీను(ఫైల్)


అశోక్(ఫైల్)

గార్ల : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అంకన్నగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఇస్లావత్ శ్రీను(48) కొంత కాలంగా భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో మనస్తాపం చెందిన శ్రీను.. బుధవారం రాత్రి గడ్డి నివారించే పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వంశీకల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి మరొకరు..

కాజీపేట : రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం న్యూశాయంపేట బొల్లం వాడకు చెందిన బొల్లం అశోక్(52) 15 రోజుల నుంచి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అలాగే, నిరంతరం మద్యం సేవిస్తున్నాడు. దీనిపై కుటుంబీకులు మద్యం తాగొద్దని చెబుతున్నా మానడం లేదు. ఈ క్రమంలో మద్యం మానలేక.. అనారోగ్య కారణాలతో మనస్తాపం చెందిన అశోక్.. న్యూశాయంపేట రైల్వే గేటు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కె భాస్కర్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుమారుడు రవీందర్‌కు అప్పగించామని సీఐ తెలిపారు.

'వల్లంపట్ల' రచనలతో చైతన్యం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్


మాట్లాడుతున్న అంపశయ్యనవీన్

కేయూ క్యాంపస్ : రచయిత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు తన సమగ్రసాహిత్యం, కళారూపాల ద్వారా సామాజిక చైతన్యం కలిగించారని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్యనవీన్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ, వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులు కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాలలో 'వల్లంపట్ల సాహిత్యం –సామాజిక చైతన్యం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు బుధవారం రాత్రి ముగిసింది. ఈ ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంతో పాటు హరితమిత్ర, అక్షరదీపిక, హేతవాద ఉద్యమం.. ఇలా తెలంగాణ ప్రాంతంలో వెలిసిన అనేక ఉద్యమాలకు తన కలం, గళం అందించిన గొప్ప ప్రజాకళాకారుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అని కొనియాడారు. సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో ఇప్పటివరకు వల్లంపట్ల వెయ్యి పాటలు ,180 కళారూపాలు, కథలు, కవిత్వం, బుర్రకథలు పల్లెసుద్దులు రచించిన వల్లంపట్ల అందరికీ ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా 'వ్యాసప్రతి' పుస్తకాన్ని అంపశయ్యనవీన్, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, ఇతర అతిథులు ఆవిష్కరించారు. సదస్సు ముగింపు సభకు తెలుగు విభాగం అధిపతి, ఆర్ట్స్‌డీన్ బన్న ఐలయ్య అధ్యక్షత వహించారు.ఈ సభలో కేయూ యూజీసీ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, కవులు, రచయితలు పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, వీఆర్ విద్యార్థి, వల్లంపట్లనాగేశ్వర్‌రావు ,డాక్టర్ రాజ్యలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్‌చిర్రరాజు, డాక్టర్ ఆగపాటిరాజ్‌కుమార్, డాక్టర్ సదాశివ, డాక్టర్ మంథినిశంకర్ డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు. కాగా, ఈ సదస్సులో వల్లంపట్ల సాహిత్యంపై పలువురు పరిశోధన పత్రాలు సమర్పించారు.

ఎమ్మార్పీఎస్-టీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా యాకయ్య


యాకయ్య

హన్మకొండ: ఎమ్మార్పీఎస్–టీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఈదునూరి యాకయ్యను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మార్పీఎస్–టీఎస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ దళితుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తున్న వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఈదునూరి యాకయ్యను ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో వివరించారు. కాగా, తనకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని యాకయ్య తెలిపారు. తనను ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

- పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు


మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

హన్మకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి శ్రేణులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్‌లో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాల స్థాయి (క్లస్టర్) బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రధాన మంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. సమావేశంలో మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, మాజీ మంత్రి గుండె విజయ రామారావు, రిటైర్డ్ డీజీపీ కృష్ణ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, నల్లగొండ పార్లమెంట్ ప్రభారి చాడ శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, రాష్ట్ర నాయకులు డాక్టర్ పి.విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీవీపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీసీ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహాన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాతే ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్‌లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టి బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్ గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ



● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

చలో రష్యా

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.



● కమల్‌హాసన్

మహేశ్ సినిమాలో?

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.



● నాగార్జున

సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ– ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తి శ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.


విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ–''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రస్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రస్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

- దేవ్ జాంద్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ– ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.